క్లుప్తంగా

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నల్లకుంట: శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని సరస్వతీ సంగీత విద్యాలయంలో ఆదివారం సంగీతం అధ్యాపకులు, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పంచశత వీణాగాన రత్న శ్రీనివాస ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అంత్యాక్షరిలో భాగంగా భక్తి గీతాలు ఆలపిస్తూ విద్యార్థులు సందడి చేశారు. అనంతరం విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహిక పంక్తి భోజనాలు చేసి ఉత్సాహంగా గడిపారు.

ఓబీసీ కమిషన్ చైర్మన్ గంగారామ్‌కు సత్కారం



అంబర్‌పేట: ఓబీసీ జాతీయ కమీషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్‌కు అంబర్‌పేట్ బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి విచ్చేసిన ఆయనను సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి జైకుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌రాజు, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, మల్లేష్ యాదవ్‌తదితరులున్నారు.

అవినాష్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సంస్కృతం విభాగంలో జంగం అవినాష్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.విజయశ్రీ పర్యవేక్షణలో కంప్యారిటివ్ స్టడీ ఆఫ్ వేమన శతకం అండ్ వేమనగీత అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అవినాష్ బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

కంటి వెలుగు కేంద్రం మార్పు

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని బోయబస్తీలో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రం సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఈస్ట్ మారేడుపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగనున్నట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి సాయి శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని బీ–సెక్షన్, డీ–సెక్షన్, అంబేడ్కర్ నగర్, మారేడుపల్లి వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయాలని వీసీ ప్రొ.రవీందర్‌ను సంఘం అధ్యాపకులు కోరారు. ఆదివారం జరిగిన ఎస్సీ, ఎస్టీ అధ్యాపక సంఘం సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాల పై చర్చించి పీహెచ్‌డీ ప్రవేశాలలో అర్హత మార్కులు తగ్గించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయాలని, ఓయూలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని తీర్మానించారు.

రెవెన్యూ అధికారుల తీరు సరికాదు

లాలాపేట: ధృవీకరణ పత్రాల జారీలో మారెడుపల్లి రెవెన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేస్తుండటంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు దళిత సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేకంగా ఎస్సీ కుల ధృవీకరణ పత్రాల జారీలో మారేడుపల్లి తహసీల్ అధికారుల తీరు రోజు రోజుకు విమర్శలకు తావిస్తోంది. పైరవీకారులతో వెళ్తేనే పని అవుతుందనే దుస్థితికి చేరిందని ఆరోపించారు. నేరుగా దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్ జారీ కోసం విచారణ పేరుతో సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంటికి వచ్చి ఇంట్లో పూజ గది ఉందా..దేవుని ఫొటోలతో కేలండర్లు, బుక్స్ ఉన్నాయా అంటూ ఇళ్లంతా కలియతిరగడం కొంత ఇబ్బందిని కల్గిస్తోందని పలువురు బాధితులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

అడ్డగుట్ట: రైలులో నుంచి జారి పడిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 26న చర్లపల్లి రైల్వే యార్డు వద్ద సికింద్రాబాద్ నుంచి కాజీపేట్ వైపు వెళ్లే డౌన్‌లైన్‌లో రైలులో నుంచి యువకుడు జారీ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుని జేబులో దొరికిన ఆధార్ కార్డును పరిశీలించగా బిహార్‌లోని గోస్వైన్‌పూర్‌కు చెందిన రాస్ బిహారీ చౌబే(23)గా గుర్తించారు.

ప్రభుత్వ డాక్టర్ల పెండింగ్ వేతనాలు విడుదల

- 2016 నుంచి పదవీ విరమణ పొందిన డాక్టర్ల జీతాల బకాయిలు
- విడుదలపై హర్షం వ్యక్తం చేసిన మెడికల్ డెంటల్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ అసోసియేషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే, అసోసియేషన్ ప్రతినిధులు

ముషీరాబాద్: రాష్ట్రంలో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ డాక్టర్లకు 2016 నుంచి బకాయిగా ఉన్న వేరియర్స్, జీతాలను కొత్త పేస్కేల్ ప్రకారం జీవో నెంబర్ 105 ద్వారా విడుదల చేయడంపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ అండ్ డెంటల్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వీరేశం, కార్యదర్శి బాల్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇప్పించాలని కోరుతూ.. గతంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను అసోసియేషన్ సభ్యులు సంప్రదించారు. దీంతో ఎమ్మెల్యే అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆర్థిక శాఖమంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ప్రభుత్వం కొత్త జీవో 105ను విడుదల చేసి తెలంగాణలో పని చేస్తున్న సుమారు 300 మందికి కొత్త పేస్కేల్ ప్రకారం జీతాలను విడుదల చేసింది.

- కోఠి మెడికల్ కళాశాలలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేసిన అసోసియేషన్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావును కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ శ్రీనివాస చారి, బీఆర్ఎస్ నాయకులు శ్యామ్‌సుందర్, కొండపల్లి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పూస నివాసానికి వెళ్లిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



గవర్నర్ బండారు దత్తాత్రేయతో పూస రాజు కుటుంబ సభ్యులు

ముషీరాబాద్: హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు, అండమాన్, నికోబార్ దీవుల ఇన్‌చార్జ్ పూస రాజు జెమిని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. పూస రాజు తండ్రి పుస స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి చెందిన వారైనా అభివృద్ధి విషయంలో కలిసి పని చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో విడివిడిగా మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పూస కుటుంబసభ్యులు శ్రీకృష్ణ, నందకుమార్, భగవాన్‌దాస్, విక్రమ్, రాంబాబు, రవిబాబు, ప్రశాంత్, పూస ప్రదీప్, బీజేపీ నాయకులు శివాజీ, అరుణ్‌కుమార్, రాజశేఖర్, బద్రీనారాయణ, నవీన్‌గౌడ్, నరేష్, సాయిచంద్, రవికుమార్, బాబు, వంశీ, వెంకటేష్, జైపాల్‌రెడ్డి, పార్థసారధి, గంగపుత్ర సంఘం నాయకులు దయానంద్ తదితరులున్నారు.

అంగన్‌వాడి కేంద్రంలో పాలు బంద్ !

చిక్కడపల్లి: జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలోని అంగన్‌వాడి కేంద్రంలో పాలు రావడం లేదని అంగన్‌వాడి టీచర్ గుర్రం నర్సమ్మ తెలిపారు. పిల్లలు, గర్భిణీలకు నెలరోజుల నుంచి పాలు ఇవ్వకపోవడంతో వారు నిత్యం పాలకోసం వచ్చి వెళ్తున్నారన్నారు. గత నెల 18 నుంచి పాలు రావడం లేదని చిన్నపిల్లల తల్లిదండ్రులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని పాలు వచ్చేలా చూడాలని స్థానికురాలు పుష్ప విన్నవించారు.

గుర్తు తెలియని వాహనాల పార్కింగ్..



పాత రామాలయం సమీపంలో పార్క్ చేసిన వాహనాలు

నల్లకుంట: పాత నల్లకుంట వివేకానంద విగ్రహం సమీపంలో రోడ్డు పక్కన గత కొద్ది రోజులుగా ద్విచక్ర వాహనాలు పార్కు చేసి ఉన్నాయి. నెలలు గడుస్తున్నా సదరు వాహనాలను తొలగించకపోవడంతో అవి పూర్తిగా దుమ్ము కొట్టుకుపోయాయి. పైగా అవి చోరీ వాహనాలా.. లేక బస్తీలోనే ఎవరైనా.. అక్కడ పార్క్ చేశారేమోనని తెలియక స్థానికులు అనుమానిస్తున్నారు. స్థానికుల వాహనాలైతే వెంటనే వాటిని అక్కడి నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే పోలీసులు స్పందించి ఈ ప్రాంతంలో కార్డెన్ సెర్చ్ చేపడితే గుర్తు తెలియని సరైన పత్రాలు లేని వాహనాలు చాలా వరకు బయట పడతాయని చెబుతున్నారు.

తవ్వారు.. మరిచారు.. !



చిక్కడపల్లి: అరుంధతినగర్ నుంచి గాంధీనగర్ లింక్ బ్రిడ్జి వరకు ఏర్పాటు చేసిన వీడీసీసీ రోడ్డులో ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. నూతన రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను కూడా ఏర్పాటు చేయకపోవడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

‘కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఆత్మహత్యలు’

లిబర్టీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వల్లే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది కృష్ణస్వరూప్ ఆరోపించారు. విద్యా సంస్థల్లో వివక్షతను అరికట్టడంలో అగ్రకుల పాలకవర్గాలు విఫలమయ్యారన్నారు. ఆదివారం దళిత బహుజన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అత్యున్నత విద్యాలయాల్లో దళిత, ఆదివాసీ, గ్రామీణ వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు వివక్షతతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని స్వయంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్కొనడం అంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందన్నారు. పాలకులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలం చెందారని ఆరోపించారు. అగ్రకుల మనువాద పాలకుల వల్ల విద్యా సంస్థల్లో వివక్షత కుల దురహంకారం పెచ్చు పెరిగిపోయిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకువచ్చి విద్యా సంస్థల్లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు భరోసా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ భారత్ జోడో సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం



హాత్‌సే హాత్ జోడోయాత్రలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్

అంబర్‌పేట: కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లడమే కర్తవ్యంగా పనిచేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. హాత్ సే హాత్ జోడో ద్వారా అంబర్‌పేట నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ విధానాలను కరపత్రాలతో వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం కృష్ణానగర్ నుంచి గోల్నాక కొత్త బ్రిడ్జి వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి యాత్రను చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యపరుస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు సద్దాం, సోహెల్, సంపత్‌యాదవ్, అభిషేక్, సర్ఫరాజ్, ఫజల్, హరితిలక్‌సింగ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి



కేబీ శ్రీధర్‌తో కేవీఎస్ శర్మ

లిబర్టీ: పవిత్రంగా భావించే గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కేవీఎస్ శర్మ విన్నవించారు. గోరక్షణకు పార్లమెంటులో చట్టం తీసుకురావాలని కోరారు. ఆదివారం లిబర్టీ ప్లాజాలో ఉన్న ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్‌ని కలిసి ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పార్టీ సహకారం కావాలని శర్మ అభ్యర్థించారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటిస్తే కలిగే లాభాలను ప్రజలకు వివరించి ప్రజల్లో చైతన్యం వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా గోవును పూజించడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ అన్నారు.

ఎ.ఎల్. మల్లయ్యకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



అంతిమయాత్రలో పాల్గొన్న పద్మారావు, ఈటల, ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మత్స్య సహకార సంఘాల సమైఖ్య మాజీ చైర్మన్ తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.ఎల్.మల్లయ్య మృతి పట్ల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కవాడిగూడలోని ఆయన నివాసానికి చేరుకుని ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మల్లయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

- రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు కిషోర్‌గౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్సీ చెరుకు సుధాకర్, ఆంధ్రప్రదేశ్ మత్స్య సహకార సంఘాల సమైక్య మాజీ చైర్మన్ ధర్మయ్య, జన శక్తి పార్టీ నాయకుడు అమర్, గంగపుత్ర నాయకులు సత్యనారాయణ, రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అంత్యక్రియలు బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో నిర్వహించారు.

గంగపుత్రుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు మరువలేనివి..

ముషీరాబాద్: గంగపుత్రుల సంక్షేమానికి ఎ.ఎల్. మల్లయ్య అందించిన సేవలు మరువలేనివని నగర గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు మీసాల ప్రసాద్ కొనియాడారు. ప్రదేశ్ గంగపుత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.ఎల్.మల్లయ్య భౌతికకాయాన్ని ఆదివారం ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు గోరఖ్‌నాథ్, ముషీరాబాద్ గంగపుత్ర సంఘం హౌసింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, ముషీరాబాద్ చేపల మార్కెట్ సొసైటీ నాయకులు చక్రపాణి తదితరులు హాజరై నివాళులర్పించారు.

వీర సావర్కర్ ఆశయాలకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట: దేశ సమైక్యతకు వీర సావర్కర్ స్ఫూర్తి ప్రదాత అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాచిగూడ చౌరస్తాలో నిర్వహించిన వీర సావర్కర్ వర్ధంతిని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్‌తో కలిసి కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా హాజరై సావర్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కేంద్రమంత్రి మాట్లాడుతూ.. దేశం కోసం వీర సావర్కర్ చూపిన తెగువ నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమ, పద్మావెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఆలె భాస్కర్, మధుసూదన్‌రెడ్డి, కన్నెరమేష్‌యాదవ్, శ్యామ్‌రాజ్, సంతోష్, చుక్క జగన్, సుభాష్ పటేల్, వనం రమేష్, సూర్యప్రకాష్ తదితరులున్నారు.

నృత్యరూపక ప్రదర్శన



చిక్కడపల్లి: సుప్రసిద్ధ నాట్యగురువు నటరాజ రామకృష్ణ జయంతి సందర్భంగా త్యాగరాయ గానసభలో నృత్యరూపకప్రదర్శన నిర్వహించారు. ఆదివారం రవళి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గంగాగౌరీ రూపకాన్ని నర్తకులు ప్రదర్శించారు. నాట్యగురువు శేషుబాబు మాట్లాడుతూ.. రవళి సంస్థ నిర్వాహకులు రమేష్ 30 ఏళ్లుగా నృత్యంలో ఉత్తమ శిక్షణ ఇస్తున్న గొప్ప గురువు అన్నారు. నటరాజ రామకృష్ణ పేరిణి నృత్యాన్ని సృష్టించారన్నారు. దాసరి వెంకటరమణ, హనుమంతరావు, నటులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి’



బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి మరింత చొరవ తీసుకుంటున్నట్లు ఆ పార్టీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట్ మల్లికార్జున్‌నగర్‌లో నిర్వహించిన పార్టీ కార్నర్ ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు వంటి నినాదాలు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, నాయకులు కృష్ణాగౌడ్, చుక్క జగన్, బుచ్చిరెడ్డి, అజయ్‌కుమార్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



బీపీ పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్

చిక్కడపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. ఈస్ట్ మారేడ్‌పల్లి షేనాయ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వైద్యులు పద్మశ్రీధర్, సుఖ్వందర్ బింద్రా, యోషిత శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి డైరెక్టర్ సురాజ్ ఉత్తమ్, మురళి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న త్యాగరాజ స్వామి సంగీత ఆరాధనోత్సవాలు



కీర్తనలను ఆలపిస్తున్న కుప్పా శారద



డీవీ మోహన కృష్ణ

నల్లకుంట: శ్రీరామగాన సభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతీ ఆలయ ప్రాంగణంలో సద్గురు త్యాగరాజ స్వామి వార్షిక ఆరాధన సంగీతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం కుప్పా శారదచే నిర్వహించిన కచేరీ జరగగా.. అనంతరం బుల్లితెర, ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ మోహన కృష్ణ ఆలపించిన త్యాగరాజ స్వామి కీర్తనలు ఆకట్టుకున్నాయి. దీనికి వయోలిన్‌పై రాధికాశ్రీనివాసన్, వీఎస్‌పీ గాయత్రి శివాని, మృదంగంపై వీణాధరి, పెరవలి జయభాస్కర్, ఘటంపై జనార్దన్ వాయిద్య సహకారం అందించారు. శ్రీరామగానసభ కార్యదర్శి సాయి శ్రీనివాస శర్మ, సంగీతాభిమానులు సుధీంద్ర కుమార్, మల్లికార్జునరావు, రమాదేవి పాల్గొన్నారు.

ముగిసిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ సమావేశాలు



ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ మహాసభల్లో జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన దేవరాజన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ సమావేశాలు ముగిశాయి. ఈ సందర్భంగా దేవరాజన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఫార్వర్డ్ బ్లాక్‌తో కలిసి వచ్చే వామపక్ష ప్రజాస్వామ్య, ప్రగతిశీల పార్టీలతో కలిసి మోదీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు రోజుకు దూసుకుపోతున్న నిరుద్యోగ సమస్యను మోదీ గాలికి వదిలేశాడని ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

నూతన కార్యవర్గం..

- జాతీయ కార్యదర్శిగా దేవరాజన్, జాతీయ చైర్మన్‌గా నరేన్‌ఛటర్జీ, వైస్ చైర్మన్‌గా కతిరావన్, కేంద్ర కార్యదర్శులుగా ఆసిన్‌సిన్హా, దాలిరామ్, జ్యోతి రంజన్ మహాపాత్ర, సంజయ్ భట్టాచార్య, సురేందర్‌రెడ్డి, అమరేష్‌కుమార్, గోవిందరాయ్‌లతో పాటు 65 మందిని జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి, ఆహ్వాన సంఘం సభ్యులు సుందరరామరాజు, తేజదీప్‌రెడ్డి, రాములుయాదవ్, వంశీధర్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, సయ్యద్ తౌఫిక్ అలీ తదితరులున్నారు.

పుస్తకాలతో కుస్తీ.. చల్లని నీడలో చదువులు!



యూనివర్సిటీ లైబ్రరీలో చదువులో నిమగ్నమైన విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ ఏడాదంతా వరుస పరీక్షలతో ఓయూ విద్యార్థులు టెన్షన్ పడుతున్నారు. యూనివర్సిటీలో ఎక్కడ చూసినా పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన వివిధ ఉద్యోగాల రాత పరీక్షలన్నీ ఈ ఏడాదిలో ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగాల భర్తీల ప్రకటన అనంతరం వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉద్యోగం నీకా..నాకా అని పోటీపడి చదువుతున్నారు. పోటీ పరీక్షలతో పాటు వివిధ కోర్సుల అకాడమీ సెమిస్టర్ పరీక్షలు, యూజీసీ నెట్, టీఎస్‌సెట్‌తో క్యాంపస్ అంతా పరీక్షల ఫీవర్ నెలకొంది. రాష్ట్ర అవతరణ అనంతరం తొలిసారి వివిధ ఉద్యోగాల ఖాళీ భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేయడంతో లక్షలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగ సాధనకు గట్టి పోటీ ఉండటంతో కొందరు సొంతగా చదువుతుండగా అనేక మంది ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. యూనివర్సిటీ లైబ్రరీ, ల్యాండ్ స్కేప్ గార్డెన్‌తో పాటు క్యాంపస్‌లో ఎక్కడ చూసినా విద్యార్థులు చదువుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

కిటకిటలాడుతున్న హాస్టల్స్..

ఓయూ క్యాంపస్ హాస్టల్స్ విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. ఉద్యోగాలకు పోటీ పడుతున్న నిరుద్యోగులు హాస్టల్స్‌లో బోర్డర్స్‌గా ఉంటున్న స్నేహితు లు, బంధువుల గదుల్లో వసతి పొందుతున్నారు. తాజాగా జరిగిన పీహెచ్‌డీ ఎంట్రన్స్ పరీక్షలో అర్హత సాధించి సీటు లభిస్తుందనే నమ్మకంతో ఉన్న అభ్య ర్థులు పరిశోధన హాస్టల్స్‌లో ముందుగానే తిష్ట వేశా రు. నిర్ణిత సంఖ్య కన్నా హాస్టల్స్‌లో అధికంగా ఉండటంతో అనేక సమస్యలు ఉన్నా విద్యార్థులు ఓపికతో సర్దుకుంటూ చదువులు సాగిస్తున్నారు. ఉద్యోగ పో టీ పరీక్షలు, పోలీసు ఉద్యోగాల పరీక్షల కారణంగా విద్యార్థులు, నిరుద్యోగులతో క్యాంపస్ నిండుగా ఉంది.

తిండికి తిప్పలు..

ఓయూలో చదువు కునేందుకు సౌకర్యాలు ఉన్నా.. తిండి తిప్పలు తప్పవు. ప్రస్తుతం చదివే విద్యార్థులకు హాస్టల్, భోజన వసతి ఉంటుంది. ఎక్స్‌బోర్డర్లు, రాబోవు విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఎక్కడో ఒక చోట వసతి ఉన్నా భోజనానికి ఇబ్బంది పడాల్సిందే. ఓయూలో చదివే విద్యార్థులు అధికంగా పేదలైనందున ఎక్కువ మంది వంట చేసుకుంటే మరి కొందరు యూనివర్సిటీ క్యాంటీన్లలో తింటున్నారు. ఉద్యోగాల కోసం తిండి, నిద్ర లేకుండా చదువుతున్న విద్యార్థులు విజయం సాధించాలని ఆశిద్దాం.